# ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమనేత,
# మార్క్సిస్టు - లెనినిస్టు బోధకుడు
# కామ్రేడ్ టి.ఎల్. నారాయణకు జోహార్లు



**ప్రజాస్వామ్య** హక్కుల పరిరక్షణ సంస్థ గౌరవాధ్యక్షులు, విశ్రాంత రసాయనశాస్త్ర అధ్యాపకులు, మార్క్సిస్టు - లెనినిస్టు బోధకులు కా॥ టి.ఎల్. నారాయణ విశాఖపట్నంలో తన 83వ ఏట 31-10-2017న క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ మరణించారు. ఆయన మరణంతో పీడిత ప్రజా ఉద్యమం ఒక సన్నిహిత ప్రజాతంత్ర మేధావిని కోల్పోయింది. కా॥ టి.ఎల్. నారాయణ మృతిపట్ల సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి తీవ్ర విచారం వ్యక్తంచేస్తూ, ఆయనకు విప్లవ జోహార్లర్పిస్తోంది.

టి.ఎల్.ఎన్. గుంటూరుజిల్లా తెనాలి సమీపంలోని కూచిపూడిలో 18-12-1934న జన్మించారు. కూచిపూడి, మచిలీపట్నం, బెనారస్‌లలో విద్యనభ్యసించారు. రసాయనశాస్త్ర అధ్యాపకునిగా నిడుబ్రోలు, తెనాలిలలో పనిచేసి, 1969 నుండి ఉద్యోగ విరమణ (1991) వరకు రేపల్లె సమీపంలోని నగరంలో వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో రసాయనశాఖ అధిపతిగా, వృత్తిపట్ల నిబద్ధత కల్గిన, విద్యార్థులతో మమేకమయ్యే అధ్యాపకునిగా విధులు నిర్వర్తించారు.

అధ్యాపక వృత్తిలో వుంటూనే, సామాజిక బాధ్యత కల్గిన మేధావిగా, హేతువాద ఉద్యమాలకు, పీడిత ప్రజల ఉద్యమాలకు క్రియాశీలక సహకారం అందించారు. 1973 నుండి పౌర, ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమంలో చేరి, 1975 నుండి ఓ.పి.డి.ఆర్.లో క్రియాశీల కార్యకర్తగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా, అధ్యక్షునిగా పనిచేశారు. చనిపోయేనాటికి ఆయన ఓ.పి.డి.ఆర్. గౌరవాధ్యక్షునిగా వున్నారు. ఆ క్రమమంతటా ఆయన అనంతపురం నుండి శ్రీకాకుళం వరకు ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కొరకు పీడిత ప్రజా ఉద్యమాలకు అండగా అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆయన భాగస్వామ్యంలో, నాయకత్వంలో అనేక నిజనిర్ధారణ కమిటీల ద్వారా వాస్తవాలను వెలికితీసి రాజ్య యంత్రాన్ని, ఆధిపత్యశక్తులను నిలవేశారు.

చార్వాక రామకృష్ణతో కలిసి హేతువాద భావాల వ్యాప్తికోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాతంత్ర విద్యార్థి యువజనులు కమ్యూనిస్టు కార్యకర్తలుగా తయారయ్యేందుకు అవసరమైన సిద్ధాంత దన్నునందించే గతితార్కిక, చారిత్రక భౌతికవాద తరగతులను ఎన్నో సందర్భాలలో బోధించారు.

అత్యంత స్నేహశీలి, ప్రేమాస్పదుడు అయిన టి.ఎల్.ఎన్. సిద్ధాంతాలపట్ల, విధానాలపట్ల ఏమాత్రం ఎవరితోనూ రాజీపడక నిక్కచ్చిగా వ్యవహరించారు. ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమం ఆటుపోట్లకు గురైనా, ఆయన అనారోగ్యం పాలయినా, కుటుంబంలో ఒడుదుడుకులు సంభవించినా ఏనాడూ నిబ్బరం కోల్పోలేదు.

పోలీసులు ఆయనపై నక్సలైటు ముద్రవేసి, ఆయనపై వేటు వేయవలసిందిగా నగరం కళాశాల యాజమాన్యాన్ని కోరినప్పటికీ ఆయన తొణకలేదు. తన కార్యాచరణ నుండి ఆయన వెనకడుగు వేయలేదు.

కా॥ టి.ఎల్.ఎన్. తన విద్యార్థి జీవితంలో రాడికల్ హ్యూమనిజం, ఆర్యసమాజం సిద్ధాంతాలకు ప్రభావితుడై, అనంతరం మార్క్సిజం వైపు ఆకర్షితుడై చివరివరకు మార్క్సిస్టు - లెనినిస్టు సిద్ధాంత రాజకీయ నిర్మాణ నిబద్ధతతో జీవించారు.

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి ఆయనకు జోహార్లర్పిస్తూ, వారి కుటుంబసభ్యులకు సంతాపం తెలియపరుస్తోంది.

౦౦౦౦